సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 6 । నవంబర్ । 2024



అభివృద్ధి పనుల పరిశీలన

జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ జోన్–3, 5, 6 పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. 8లో



గొంతు దిగని ముద్ద.!

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థాకలి తప్పడం లేదు. ఈ పథకం అమలులో నిర్లక్ష్యం చూపుతున్నారు. 8లో



కళకాలం గుర్తుండాలి

8లో

న్యూస్‌రీల్

డిసెంబర్ 14న మెగా లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్. చిత్రంలో సీపీ బాగ్చి

విశాఖ లీగల్ : వచ్చే నెల 14వ తేదీన మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ వెల్లడించారు. మంగళవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వివిధ కంపెనీల న్యాయ సలహాదారులు, బీమా, బ్యాంకులు, పోలీస్ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి నెల రోజులపాటు అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించే న్యాయమూర్తులకు తమ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం, లోక్ అదాలత్ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, సీనియర్ జూనియర్ న్యాయమూర్తులు, పలు జిల్లాల న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఏపీ ఫెర్వాస్‌కు పతకాల పంట

విశాఖ సిటీ: జల సంరక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విశాఖకు చెందిన ఆంధ్రప్రదేశ్ కాలనీ సంక్షేమ సమాఖ్య(ఏపీఫెర్వాస్) 6 బహుమతులు గెలుచుకున్నట్లు ఏపీ ఫెర్వాస్ ప్రతినిధి డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 11వ కాలనీ సంక్షేమ సంఘాల జాతీయ సదస్సులో ఈ పతకాలను అందుకోనున్నట్లు వెల్లడించారు. వ్యక్తిగత హోదాలో ఉత్తమ కాలనీ సంక్షేమ సారథులుగా ఏపీ ఫెర్వాస్‌కు 4 బహుమతులు లభించాయన్నారు. జోన్–8 (సింహాచలం)కు చెందిన పులకాల మాధవరావు, జోన్–5(మురళీనగర్)కు చెందిన కర్రి శేషగిరిరావు ఎన్నికైనట్లు చెప్పారు. నగరంలో జలసంరక్షణ కోసం చేసిన కృషికి ఈ అవార్డ్ లభించినట్లు వివరించారు ఉత్తమ కాలనీ సంక్షేమ సంఘాలుగా పాత వెంకోజీపాలేనికి చెందిన జేఆర్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం, కూర్మన్నపాలేనికి చెందిన తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘాలకు కూడా ఈ జాతీయ సదస్సులో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

10న డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎంపిక పరీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారికి డీఎస్సీ ఉచిత శిక్షణకు ఈ నెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో 10 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందని.. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి సుమారు 3,200 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పరీక్ష కేంద్రాల్లో నెట్‌వర్క్, విద్యుత్ సదుపాయం నిరంతరాయంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, ఆర్టీసీ సర్వీసులను ఆయా కేంద్రాల రూట్లలో నడపాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు మాట్లాడుతూ ఎంపికైన వారికి మూడు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్, మెస్ ఫీజులు చెల్లిస్తామని వివరించారు. సమావేశంలో డీఆర్వో భవానీ శంకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, పరీక్ష కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సిరులతల్లికి లక్ష కుంకుమార్చన



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో లక్ష కుంకుమార్చన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10 వేలు చెల్లిస్తే వారి తరఫున నలుగురు దంపతులను అనుమతించనున్నట్లు ఈవో శోభారాణి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలోని పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి నిర్వహించారు. ముడసర్లోవ, కంబాలకొండ పార్కు, జూ పార్కు, జోడుగుళ్లపాలెం, విశాఖ వేలీ స్కూల్ రోడ్డు, కైలాసగిరి, ఏయూ క్యాంపస్, పోర్టు స్టేడియం, పోర్టు క్వార్టర్స్ ప్రాంతాలు, తగరపువలస, గాజువాక, పెందుర్తి తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్ద మంగళవారం విశేషంగా పూజలు చేశారు. ముందుగా పుట్టల వద్ద ముగ్గులతో అలంకరించారు. తర్వాత పాలు, కోడి గుడ్లు, నువ్వుండలు వేసి పూజించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఈ ప్రాంతాలు సందడిగా మారాయి.





జగదాంబ దగ్గర పోతురాజు పుట్ట వద్ద భక్తుల పూజలు



ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ రోడ్డులో రద్దీ

జూకు పోటెత్తారు

ఆరిలోవ: నాగులచవితి సందర్భంగా జూ పార్కుకు మంగళవారం రూ.లక్షల్లో ఆదాయం సమకూరింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన ద్వారం, సాగర్ ద్వారం నుంచి 9,914 మంది జూను సందర్శించినట్లు ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వారి ద్వారా రూ.7,58,279 ఆదాయం లభించిందని ఆమె వెల్లడించారు. జూ లోపలకు ఎలాంటి బాణసంచా తీసుకెళ్లకుండా సిబ్బంది తనిఖీలు చేపట్టారన్నారు. కార్తీకమాసంలో సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు.



జిరాఫీల ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

కంబాలకొండ కళకళ

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కు మంగళవారం నాగులచవితి భక్తులతో కళకళలాడింది. 3 వేల మందికి పైగా పార్కును సందర్శించగా.. వారి ద్వారా రూ.2.14 లక్షల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ పుట్టల వద్ద భక్తులు నాగులచవితి వేడుకలు నిర్వహించి.. అనంతరం కుటుంబాలతో కలిసి పిక్నిక్‌లు జరుపుకున్నారు. రోజంతా ఇక్కడే గడిపి.. చెట్ల కింద సహపంక్తి భోజనాలు చేశారు. పిల్లలు సరదాగా ఆటలు ఆడారు.



కంబాలకొండలో ఆటలాడుతున్న పిల్లలు

● సమాంతర చదువుకు చరమగీతం

అంతా మా ఇష్టం

సొంత ప్రశ్నాపత్రాలతో ప్రయివేటు స్కూళ్లలో పరీక్షలు

- ప్రభుత్వ స్కూళ్లలో ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలు
- ప్రయివేటు యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్న కూటమి ప్రభుత్వం
- నేటి నుంచి ఫార్మెటివ్ పరీక్షలు

విశాఖ విద్య : కూటమి ప్రభుత్వం సమాంతర చదువులకు చరమగీతం పాడుతోంది. ప్రభుత్వ స్కూళ్లలో ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహిస్తుండగా.. ప్రైవేటు స్కూళ్లలో మాత్రం సొంత ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహించుకునేందుకు అంగీకరించింది. దీంతో పాఠశాల స్థాయిలో పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. జిల్లాలో ఫార్మెటివ్–2(శామ్) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతుండగా.. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 3.44 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలు కావడంతో వీటి నిర్వహణపై జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు.

ప్రైవేటు స్కూళ్లలో సొంత ప్రశ్నాపత్రాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో సమాంతర చదువులకు ప్రాధాన్యం ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర విద్య, శిక్షణ పరిశోధన సంస్థ(ఎస్‌సీఈఆర్టీ) ఆధ్వర్యంలో రూపొందించిన ప్రశ్నాపత్రాలతోనే ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని స్కూళ్లలో ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్లలో మాత్రమే ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలతో ఫార్మెటివ్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు సొంతంగా ప్రశ్నాపత్రాలను సిద్ధం చేసుకొని పరీక్ష నిర్వహించుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహించేందుకు అంగీకరించే ప్రైవేటు స్కూళ్లకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా ప్రశ్నాపత్రాలను సరఫరా చేయనుంది.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

మార్కుల మాయాజాలానికి ఊతం

ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షల్లో సాధించిన మార్కులను విద్యార్థుల సామర్థ్యానికి కొలమానంగా చూస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అలాంటప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో వేర్వేరు ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహించడం వల్ల వాస్తవికత ఎలా తెలుస్తుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఎక్కువ మార్కులు వేసుకునేలా వెసులుబాటు కల్పించినట్లు అవుతుందని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఈ మొత్తం పరిణామాలతో భవిష్యత్‌లో ప్రైవేటు స్కూళ్లకు క్రేజ్ పెరిగి, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని అంటున్నారు.

జిల్లాలో మొత్తం స్కూళ్లు **1,387**
పరీక్షలు రాయనున్న విద్యార్థులు **3.44** లక్షలు
ప్రభుత్వ స్కూళ్లు **546**
ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రంతో రాసే ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు **83,336**
ప్రైవేటు స్కూళ్లు **841**
ఇందులో చదువుతున్న విద్యార్థులు **2,60,664**
ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రానికి అంగీకరించిన ప్రైవేటు స్కూళ్లు **62**
ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రంతో పరీక్ష రాసేవారు **4,240**

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఫార్మెటివ్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. బుధవారం నుంచి ఈ నెల 8 వరకు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరిపడా ప్రశ్నాపత్రాలను డీసీఈబీ ద్వారా ముద్రించి స్కూల్ కాంప్లెక్స్‌లకు అందజేశాం. ఏ రోజుకారోజు అక్కడ నుంచి పాఠశాలల ఉపాధ్యాయులు తీసుకెళ్లాలి. జిల్లాలోని 62 ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలు కావాలని అడిగారు. వారికి అందజేస్తాం. పరీక్షల అనంతరం మూల్యాంకనం పూర్తి చేసి, మార్కులను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించాం.

– కృష్ణకుమార్, డీసీఈబీ సెక్రటరీ

రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- సహకరించాలని సీపీ బాగ్చికి విజ్ఞప్తి



సమీక్షిస్తున్న పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్

డాబాగార్డెన్స్: నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సమావేశమయ్యారు. జీవీఎంసీ కమిషనర్ చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులు, ఎస్‌హెచ్‌ఏ ప్రతినిధులు, ట్రాఫిక్ ఆడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.ప్రవీణ్‌కుమార్‌తో మంగళవారం ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాలు, జంక్షన్లలో ట్రాఫిక్‌కు సంబంధించి సీసీ కెమెరాలు, వీధిలైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, జంక్షన్ లైట్లు, చీకటి ప్రదేశాలు, కొత్తగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు తదితర సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ సహకరించాలని కోరారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 1.18 లక్షలకు పైగా వీధి దీపాలు, జంక్షన్లలో లైట్లు ఉన్నాయన్నారు. పనిచేయని వాటికి మరమ్మతులు చేపడుతున్నామని, చీకటి ప్రాంతాలు గుర్తించి అక్కడ కొత్త లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాంతివంతమైన లైట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. సీసీ కెమెరాలు, పాదచారుల క్రాసింగ్ సిగ్నల్స్‌లను పునరుద్ధరిస్తామన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సహకరించాలని సీపీని కోరారు. నగరంలో స్థలాలు గుర్తించి వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని, పలు కూడళ్లలో ట్రాఫిక్ ఐలాండ్‌లు ఏర్పాటుకు పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ ఆఖరి నాటికి ఈ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు పీవీవీ సత్యనారాయణరాజు, సంపత్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీధర్, స్మార్ట్ సిటీ అధికారులు, కంట్రోల్ రూమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, ఈస్ట్–2 ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో మహిళా ఎస్పీ రుబాబు!

సింహాచలం: శ్రీ వరహా లక్ష్మీనృసింహ ఆలయంలో సోమవారం రాత్రి ఓ మహిళా ఎస్పీ రుబాబు చర్చనీయాంశమైంది. ఆ సమయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, వైదికులకు, ఆమెకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనాలు రాత్రి 7 గంటలకు ఆపి.. ఆరాధన నిర్వహించడం ఆనవాయితీ. ఆ సమయంలో ఎవరికీ దర్శనాలు లభించవు. అదే సమయంలో మహిళా ఎస్పీ రూ.300 టికెట్టు తీసుకుని దర్శనానికి వచ్చారు. అప్పటికే దివిటీ సేవ జరుగుతోందని, దర్శనాలు నిలుపుచేశామని, భోగమండపంలో తెర కూడా వేసేశామని అక్కడ విధుల్లో ఉన్న వారు ఆమెకు చెప్పారు. ఈ క్రమంలో ఉద్యోగులకు, ఆమెకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి ఒక అర్చకుడు ఆమెను దర్శనానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఎస్పీ వెంట వచ్చిన వ్యక్తి ఫోన్ మాట్లాడుతుండగా.. ఆ ఫోన్‌ను ఆలయ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఎస్‌పీఎఫ్ సిబ్బంది తీసుకున్నారు. కాగా.. సెల్‌ఫోన్ తీసుకున్న ఇద్దరు ఎస్‌పీఎఫ్ గార్డులపై వారి ఉన్నతాధికారులకు ఆ ఎస్పీ ఫిర్యాదు చేశారు. దీంతో వారిద్దరినీ ఆలయంలో విధుల నుంచి తప్పించి.. మరో ఇద్దరిని నియమించినట్లు తెలిసింది. ఈ సంఘటనపై విధుల్లో ఉన్న సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా తనకు ఏమీ తెలియదని చెప్పారు. గతంలో తెర వేసిన తర్వాత కూడా పలువురికి దర్శనాలు కల్పించి.. అర్చకులు విమర్శలు పాలైన సంఘటనలు ఉన్నాయి. ఆలయ అధికారులు, అర్చకులు, ఇతర సిబ్బందికి మధ్య సమన్వయం కొరవడటంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని భక్తులు మండిపడుతున్నారు.

నేటి నుంచి రసజ్ఞ జాతీయ నాటకోత్సవాలు

మద్దిలపాలెం: స్థానిక కళాభారతిలో బుధవారం (6వ తేదీ) నుంచి శనివారం(9వ తేదీ) వరకు రసజ్ఞ 3వ జాతీయ నాటకోత్సవాలు జరగనున్నట్లు రసజ్ఞ వ్యవస్థాపక అధ్యక్షుడు, నాటకోత్సవాల డైరెక్టర్ డాక్టర్ వేమలి త్రినాథరావు తెలిపారు. రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నాటకోత్సవాలు భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సౌజన్యంతో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతికశాఖల సంయుక్త నిర్వహణలో జరుగుతాయన్నారు. ఈ ప్రదర్శనలకు అందరూ ఆహ్వానితులేనని వెల్లడించారు.

ప్రదర్శించే నాటకాలు

- తొలి రోజు(6న) మధుర స్వరం తెలుగు నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ నాటకాన్ని డి.హేమవెంకటేశ్వరి రచించగా, ఉత్సవ నిర్వాహకుడు, రసజ్ఞ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వేమలి త్రినాథరావు దర్శకత్వం వహించనున్నారు.
- 2వ రోజు(7న) ఎస్‌హెచ్–316 ఒడియా నాటకాన్ని అభినయ జాగృతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని ఉత్కల్ సంగీత మహావిద్యాలయ సభ్యులు పాత్రధారులుగా ఈ నాటకాన్ని ప్రదర్శించనున్నారు. మాస్ ప్రజల్ని ఆడిటోరియంలోకి రప్పించడమే లక్ష్యంగా సామాజిక సందేశాలను వాస్తవికంగా తెలియజేయడంలో ఈ గ్రూప్ ప్రసిద్ధి. అజిత్‌దాస్ రూపకల్పనలోని ఈ నాటకాన్ని దీపక్ రంజన్ పాటి(అమాన్) పర్యవేక్షించనున్నారు.
- 3వ రోజు(8న) దేబాషిష్ దత్ స్థాపించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాక్చువల్ థియేటర్ ఆర్ట్స్(ఐఎఫ్‌టీఏ) ఆధ్వర్యంలో స్వీయ దర్శకత్వంలో బెంగాలీ నాటకం 'కృష్ణ'ను ప్రదర్శించనున్నారు. పాతికేళ్లుగా 50కి పైగా థియేటర్ ప్రొడక్షన్లను ఏర్పాటు చేసిన ఘనత ఈ సంస్థది.
- చివరి, 4వ రోజైన 9న దివాకర్‌బాబు మాడభూషి రచించిన భూతకాలం నాటకాన్ని ప్రదర్శించనున్నారు. దీనికి డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించనున్నారు.
- తెలుగు నాటకాలతోపాటు, ఒడియా, బెంగాలీ నాటకాలు కూడా ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

రీచ్‌ల వద్ద ఇసుక బుకింగ్‌కు అవకాశం

మహారాణిపేట: రాజమహేంద్రవరం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని రీచ్‌ల నుంచి ఇసుక బుక్ చేసుకునేందుకు జిల్లా యంత్రాంగం అవకాశం కల్పించింది. ఇసుకకు సంబంధించిన వివరాలు, ఫిర్యాదుల నమోదుకు జిల్లా ఇసుక సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబర్ 1800–599–4599, జిల్లా స్థాయి టోల్ ఫ్రీ నంబర్ 1800–425–6017కు ఫిర్యాదులు చేయవచ్చు. dmgapsandcomplaints@yahoo. com, vspdmgosandcomplaints@yahoo. comకు కూడా మెయిల్ చేయవచ్చని ఇసుక కమిటీ మెంబర్ కన్వీనర్ తెలిపారు. వివరాలకు 0891- 2590100, 0891-2590102కు సంప్రదించవచ్చు.

ఇసుక బుకింగ్ ఇలా..

- ఇసుక అవసరమైన వ్యక్తులు, కాంట్రాక్టర్లు https://sand.ap.gov.in లో ఆధార్ నంబర్‌తో నమోదు చేసుకోవాలి. నమోదు అయిన తర్వాత సాధారణ వినియోగం కోసం ఉచిత ఇసుక రవాణా సమాచార పత్రం లభిస్తుంది.
- ఎక్కడ నుంచి ఇసుక కావాలి, అర్బన్/రూరల్, మండలం/మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ/వార్డు, గ్రామం/సెక్రటేరియట్, బిల్డింగ్ అనుమతి సంఖ్య, బిల్డింగ్ విస్తీర్ణం (ఎస్ఎఫ్‌టీ) సైట్ వివరాలన్నీ పోర్టల్‌లో నమోదు చేయాలి.
- పోర్టల్‌లో అధీకృత సరఫరా పాయింట్ వద్ద నమోదు చేసుకున్న తర్వాత ఉచిత ఇ–ట్రాన్సిట్ ఫారాన్ని పొందాలి.
- ఇ–ట్రాన్సిట్ ఫారం/పర్మిట్ కలిగి ఉన్న వినియోగదారులు సొంతంగా లేదా డీఎంజీ వెబ్‌సైట్‌లో అందించిన విధంగా రిజిస్టర్డ్ వాహన జాబితా నుంచి పరస్పరం అంగీకరించిన ఖర్చుతో రవాణా చేసుకోవచ్చు. రవాణా చార్జీలు వినియోగదారులు నేరుగా రవాణాదారులకు చెల్లించాలి.
- వినియోగదారుడు/ రవాణాదారు ఇసుక సరఫరా కేంద్రాన్ని సంప్రదించి, ఇన్‌చార్జి నుంచి డెలివరీ తేదీ, సమయ స్లాట్‌ను తీసుకోవాలి.
- ట్రాన్స్‌పోర్టర్ నిర్ణీత స్లాట్‌లో రీచ్‌ను చేరుకోవాలి. సొంత లేబర్‌తో నేరుగా రీచ్ నుంచి లోడ్ చేసుకోవచ్చు లేదా నిర్దిష్ట సప్లై పాయింట్ కోసం డీఎల్ఎస్‌సీ ఎంచుకున్న ఏజెన్సీ నుంచి సహాయం తీసుకోవచ్చు.
- ఇసుక రవాణా వాహనాలకు 'ఉచిత ఇసుక రవాణా వాహనం' బ్యానర్‌తో పాటు జీపీఎస్ అమర్చాలి.

స్తంభం పై నుంచి పడి జూనియర్ లైన్‌మన్ దుర్మరణం




ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్

మధురవాడ : విద్యుత్తు స్తంభం పైనుంచి జారిపడి జూనియర్ లైన్‌మన్ మృతి చెందారు. ఈ ఘటన జోన్–3 కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి 7.30 గంటలకు కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి మారికవలస టయోటా షోరూం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ బ్రేక్ డౌన్ అయింది. సమాచారం అందుకున్న జూనియర్ లైన్‌మన్ బలివాడ వెంకటేష్(37) అక్కడకు చేరుకొని విద్యుత్ స్తంభం ఎక్కి పనులు పూర్తి చేశాడు. కిందకి దిగే క్రమంలో స్తంభం పైనుంచి జారి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో సహచర సిబ్బంది సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుడి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పలాస సమీపంలోని హరిపురం. కొన్నాళ్ల క్రితం లక్ష్మిమనోహరితో వివాహం జరిగింది. ఐదేళ్ల నుంచి కొమ్మాది సెక్షన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ రిక్షా కాలనీలో నివాసం ఉంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. సెక్షన్‌లో మంచి ఉద్యోగిగా పేరు సంపాదించుకున్న వెంకటేష్ మరణంతో సహచర సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఘాటెక్కిన వెల్లుల్లి

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.400
- డీసీఎంఎస్ కౌంటర్లలో కిలో రూ. 310

సీతమ్మధార: వంటింటి సరకులు సామాన్యులకు భారంగా మారిపోతున్నాయి. అసలు వంట చేయాలంటేనే గృహిణులు భయపడిపోతున్నారు. ప్రతి కూరలో వినియోగించే వెల్లుల్లి ధరలు మండిపోతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో వెల్లుల్లిపాయల ధర రూ.400 వరకు పలుకుతోంది. పెరిగిన ధరల భారంతో ఆహారం నుంచి వెల్లుల్లి కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దిగుబడులు తగ్గడం వల్లనే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. రైతుబజార్లలో వెల్లుల్లిపాయలు కిలో రూ.290లకు, అక్కడే ఉన్న డీసీఎంఎస్ కౌంటర్లలో రూ.310 చొప్పున విక్రయిస్తున్నారు. కొద్దిరోజులుగా రైతుబజార్లలో విక్రయిస్తున్న వెల్లుల్లిపాయలు నాసిరకంగా ఉంటున్నాయని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ, పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించి ధరలు నియంత్రించే చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.



ఎస్సీలంటే అంత చులకనా పవన్?

- హోం మినిస్టర్ పదవిపై మోజుంటే చంద్రబాబును అడుక్కోండి
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా హితవు

అల్లిపురం: ఎస్సీలంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అంత చులకన ఎందుకని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ ప్రశ్నించారు. ఎస్సీ వర్గానికి చెందిన హోం మినిస్టర్‌పై డిప్యూటీ సీఎం చేసిన అనుచిత వాఖ్యలను ఆయన మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. మిత్రపక్షంలో ఉండి.. ఒక మహిళ అని కూడా చూడకుండా హోం మినిస్టర్‌ని దూషించడం సమంజసం కాదన్నారు. గత ప్రభుత్వంలో 30 వేల మంది మహిళలు కనిపించడం లేదన్న పవన్.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కరినైనా కనిపెట్టగలిగారా అని ప్రశ్నించారు. తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన దాడులు, లైంగిక దాడులకు కారణం ఓ సామాజిక వర్గమే అని ఆరోపించారు. పవన్ చేస్తున్న విమర్శల్లో న్యాయబద్ధత లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో పదవి ఇస్తారే తప్ప పవర్ మాత్రం ఇవ్వరని.. పవర్‌ను సీఎం చేతుల్లోనే పెట్టుకుంటారని పవన్‌కు తెలియదా అని అన్నారు. అంతగా పవర్ కావాలంటే సీఎం చంద్రబాబును అడిగి తీసుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తక్షణమే ఎస్సీలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

మధురవాడ: బక్కన్నపాలెం 234 సీఆర్‌పీఎఫ్ యూనిట్‌లో పనిచేస్తున్న సోమి త్యాగి(43) అనే కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ. ఈ యూనిట్‌లో పనిచేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన సోమి త్యాగి దైనందిన కార్యకలాపాల తర్వాత అస్వస్థతకు గురికావడంతో అధికారులు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. తర్వాత వాంతులు అవ్వడం, తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళకాలం గుర్తుండాలి



అటు అందం.. ఇటు అభినయం కలగలిపిన విశాఖ సోయగం హేమలతారెడ్డి.. గ్లామర్ ఫీల్డ్‌లో పాదరసంలా దూసుకుపోతున్నారు. బుల్లితెర, వెండితెర, ఫ్యాషన్ రంగాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పలు టీవీ చానళ్లలో యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ వచ్చారు. అటు సీరియళ్లు, సినిమాలు.. ఇటు ఫ్యాషన్ రంగంలో విజయాలతో తన కలలను సాకారం చేసుకుంటున్నారు. వెండితెరపై నా పేరుండాలి.. నా నటన అందరూ గుర్తుపెట్టుకోవాలి.. అని అంటున్న ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. -సీతమ్మధార

- బుల్లితెర, వెండితెరపై రాణిస్తున్న హేమలతా రెడ్డి
- ఫ్యాషన్ రంగంలోనూ సత్తా
- గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియాగా విశేష గుర్తింపు

సాక్షి ఇంటర్వ్యూ

విశాఖలోనే ఓనమాలు

విశాఖ నటనలో నాకు ఓనమాలు నేర్పింది. ఇక్కడ ఎన్నో విషయాలు నేర్చుకున్నా.. ఇప్పుడీస్థాయిలో ఉండడానికి కారణం నా తల్లిదండ్రులే. డాబాగార్డెన్స్‌లో ఉంటున్నారు. నాన్న సూర్య దేవర వెంకటరావు నేవీలో పనిచేసి రిటైరయ్యారు. ఇక్కడే సెటిల్ అయ్యారు. చదువంతా సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలో సాగింది. తాను ఇంటర్ వరకు అక్కడే చదివా. తర్వాత ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ క్లాసికల్ చేశా. తల్లి ధనలక్ష్మిది ఫైనాన్స్ వ్యాపారం.

న్యూస్ రీడర్ నుంచి హీరోయిన్ వరకు..

నాన్న నన్ను న్యూస్ రీడర్‌గా చూడాలనుకున్నారు. ముందుగా టీవీ 9, తర్వాత ఎన్‌టీవీలో ఎంటర్‌టైన్‌మెంట్ షోలు చేశా. ఎందరో హీరోయిన్లను ఇంటర్వ్యూ చేశా. జెమిని టీవీలో సినిమా న్యూస్‌రీడర్‌గా చేశా. మంచు విష్ణు నిర్మించిన హ్యాపీడేస్ సీరియల్‌లో కల్యాణి పాత్రలో నటించా. ఆ సీరియల్‌కు, అందులో నా పాత్రకు మంచి ఆదరణ లభించింది. అంతఃపురం, క్రైం తదితర సీరియల్స్ చేశాను. జెమిని, మా టీవీలో నేను నటించిన సీరియల్స్ ప్రసారమయ్యాయి. నేను ఇప్పటివరకు సుమారుగా 20 వరకు సీరియల్స్‌లో నటించాను. గతంలో విశాఖ బిగ్ ఎఫ్‌ఎంలో జాబ్ కోసం ట్రై చేశా. ఇప్పుడు అదే ఎఫ్‌ఎంలో నన్ను ఇంటర్వ్యూ అడగడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో నటించాలన్నదే నా చిరకాల కోరిక. సౌందర్య, సమంత తన అభిమాన హీరోయిన్లు. తెలుగు హీరోయిన్లు అంజలి, వైష్ణవి సినిమాల్లో రాణిస్తున్నారు. వారి లాగే నన్ను ప్రేక్షకులు ఆదరిస్తున్నందుకు ఆనందంగా ఉంది. వీరభద్ర క్రియేషన్స్ పేరిట సొంత బ్యానర్‌ను 2017లో ప్రారంభించాను.

తొలి సినిమా ప్రవరాఖ్యుడు

నా తొలి సినిమా ప్రవరాఖ్యుడులో హీరోయిన్ ప్రియమణికి స్నేహితురాలిగా చేశా. నిన్నే చూసి సినిమా తనకు రెండోది. ఆకృతి టచ్ మీ నాట్ సినిమాలో వైవిధ్యమైన పాత్రలో నటించాను. నాకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాన్న ప్రోత్సాహంతో పసుమర్తి సీతారామయ్య వద్ద నృత్యం నేర్చుకున్నాను. ఆ శిక్షణ ఇప్పుడు సినిమాలు, సీరియల్స్‌లో ఎంతగానో ఉపయోగపడుతోంది.

గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియాగా...

గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా విన్నర్ నేనే. మలేసియాలో సెప్టెంబర్ జరిగిన పోటీల్లో విజేతగా నిలవడం సంతోషంగా ఉంది. ఫ్యాషన్‌షోలో టైటిల్ గెలవడం ఇదే తొలిసారి. తల్లిదండ్రులు, నా భర్త ప్రోత్సాహంతో ఈ రంగంలో రాణిస్తున్నాను. మంచి పాత్రలతో మెప్పించాలన్నది నా డ్రీమ్.. చాలా కథలు వింటున్న.. త్వరలోనే నా తదుపరి చిత్రాల వివరాలు వెల్లడిస్తా..



గ్లామర్ ఆన్ మిసెస్ ఇండియా అవార్డుతో..

విశాఖలో జన్మించిన పోతురెడ్డి హేమలతా రెడ్డి మలేసియాలో జరిగిన గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియాగా నిలిచారు. మొదట లోకల్ టీవీ, జెమినీ టీవీ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత పలు షోలో పాల్గొన్నారు. హ్యాపీడేస్ సీరియల్‌లో లీడ్ రోల్ చేసి బుల్లితెర ప్రేక్షకుల మనసులు దోచుకున్నారు. అనంతరం హీరో జగపతిబాబుతో ప్రవరాఖ్యుడు సినిమాలో నటించారు. అందులో హేమలతా రెడ్డి హీరోయిన్ ప్రియమణి స్నేహితురాలిగా నటించారు. నిన్నే చూసి సినిమాలో హీరోయిన్‌గా నటించి నిర్మాతగా వ్యవహరించారు. అక్కడ నుంచి మిసెస్ ఇండియా పోటీలో విశాఖ నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రపంచ వ్యాప్తంగా 300 మందిలో విజేతగా నిలిచారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఉదయం తల్లిదండ్రులతో కలిసి నాగుల చవితి పూజలు
- వారు విధులకు వెళ్లి, తిరిగొచ్చే సరికి విగతజీవిగా మారిన వైనం



పవన్ తేజ్ కుమార్(ఫైల్)

పెందుర్తి: ఉదయం తల్లిదండ్రులతో కలిసి నాగుల చవితి పూజలు చేసిన ఓ విద్యార్థి మధ్యాహ్నానికి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పెందుర్తిలో సంచలనం సృష్టించిన ఈ విషాద ఘటన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటున్న ముత్యాలు ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, అతని భార్య వరలక్ష్మి స్థానికంగా ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. వీరి కుమారుడు పవన్‌తేజ్‌కుమార్(13) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం కుటుంబమంతా కలిసి నాగుల చవితి సందర్భంగా కాలనీకి సమీపంలోని పుట్ట వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి, ఇంటికి వచ్చారు. తండ్రి ముత్యాలు విధులకు, తల్లి వరలక్ష్మి ఆశా కార్యకర్తల సమావేశానికి వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి వచ్చిన తల్లి, ఎంతగా తలుపు కొట్టినా కొడుకు తీయలేదు. దీంతో స్థానికులు వచ్చి తలుపులు పగలగొట్టారు. లోపలికి వెళ్లి చూసే సరికి పవన్ మెడకు చున్నీ బిగించి తలుపును ఆనుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే స్థానికులు పెందుర్తి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసును అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు

పెందుర్తి: ఉమ్మడి విశాఖ జిల్లాలోని పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీల శిక్షణ తరగతులను జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మంగళవారం ప్రారంభించారు. స్థానిక టీటీడీసీ శిక్షణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. దానికి అనుగుణంగా స్థానిక పరిస్థితులను సమన్వయం చేసుకుని మండల స్థాయి అధికారులు ఆయా ప్రణాళికను అమలు పరచాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తొలి దశలోని శిక్షణలో భాగంగా మంగళ, బుధవారాల్లో శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. రెండో దశలో గురు, శుక్రవారాల్లో అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డెప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు, శిక్షణ తరగతుల నిర్వాహకులు కె.వెంకటరావు, కె.కరుణాకరరావు, పి.చంద్రశేఖర్‌నాయుడు, 16 మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం జోన్-3, 5, 6 పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ది పనులను జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జోన్-3 పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్-11 వద్ద ఉన్న శ్మశాన వాటిక, కేఆర్‌ఎం కాలనీలో అభివృద్ధి చేస్తున్న శ్మశాన వాటిక, గొల్లలపాలెం మార్కెట్ వద్ద అభివృద్ధి పరుస్తున్న శ్మశాన వాటికను పరిశీలించి మౌలిక వసతులు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దొండపర్తి జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం ప్రధాన రహదారి వరకు అభివృద్ధి చేసిన రోడ్డును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దొండపర్తి జంక్షన్ వద్ద కాలువలు విస్తరణ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలియజేయగా, కాలువలు వద్ద అడ్డంకులు తొలగించి మరమ్మతులు చేస్తే, కాలువలు విస్తరించాల్సిన పని ఉండదని ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. యారాడ కొండపై ఉన్న రోడ్డును పరిశీలించిన ఆయన రోడ్లను సాంకేతికంగా, ప్రణాళికాయుతంగా అభివృద్ధి పరచాలని అధికారులకు సూచించారు. అనంతరం జోన్-6 పరిధి గాజువాక ప్రాంతం సుందరయ్య కాలనీ హెడ్ వాటర్ వర్క్సులలో 10 ఎంజీడీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పునరుద్ధరణ, ఇతర అభివృద్ధి పనులు పరిశీలించి ఫిల్టర్ బెడ్స్, ఎలక్ట్రికల్ కాంపోనెంట్స్ ఇన్‌స్టాలేషన్, ఫిక్సింగ్ ఫ్లో మీటర్లను పరిశీలించి వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



దొండపర్తి జంక్షన్ వద్ద కాలువ విస్తరణ పనులు పరిశీలించి పలు సూచనలు చేస్తున్న కమిషనర్

గొంతు దిగని ముద్ద.!

రుచిగా, శుచిగా ఉండడం లేదని నిరాకరణ

ఇంటి భోజనానికే అధిక శాతం విద్యార్థుల మొగ్గు

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం కింద అందిస్తున్న ఆహారం రుచిగా, శుచిగా ఉండడం లేదని అధిక శాతం విద్యార్థులు దూరంగా ఉంటున్నారు. చివరికి కోడి గుడ్డును సైతం వద్దంటున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్నవి వాడుతుండడం, ఉడికించిన కోడిగుడ్డు నాణ్యతగా ఉండకపోవడం.. దుర్వాసన వెదజల్లుతుండడంతో వాటిని స్వీకరించేందుకు ఇష్టపడడంలేదు. పాఠశాల భోజనం నాసిరకంగా ఉందనే కారణంతో సగం మందికిపైగా విద్యార్థులు ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు.

- అధ్వానంగా మధ్యాహ్న భోజనం
- ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్న వైనం
- చాలాచోట్ల కోడిగుడ్డు తీసుకోవడానికి విముఖత
- హాజరు నమోదులో అంకెల గారడీ



ట్యాప్‌లో నీటిని పట్టుకుంటున్న విద్యార్థులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అర్ధాకలి తప్పడం లేదు. మధ్యాహ్న భోజనం పథకానికి డొక్కా సీతమ్మ అని పేరైతే మార్చేశారు కానీ, దీన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. దీంతో బడి భోజనం నాణ్యత లోపించింది. కోడిగుడ్లు కుళ్లిన వాసన వస్తుండటంతో వాటిని తీసుకునేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదు. ముక్కిన బియ్యం సరఫరా చేస్తుండటంతో, రుచీ పచీ లేక విద్యార్థులు తినటం మానేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజీలు తీసుకొస్తున్నారు. మధ్యాహ్న భోజనం పథకం అమలయ్యే జిల్లాలోని ఏ స్కూల్‌కు వెళ్లి చూసినా ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. భోజనం నాసిరకంగా ఉంటుండడంతో ముద్ద గొంతుదిగడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

581 పాఠశాలల్లో భోజన పథకం

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 581 పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. 2024-25లో నమోదైన గణాంకాల మేరకు 72,892 మంది విద్యార్థులకు బడిలో మధ్యాహ్న భోజనం అందించేలా ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేస్తోంది. వీటిలో 338 స్కూళ్లలోని సుమారు 47 వేల మంది విద్యార్థులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం సరఫరా చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెనూ రూపొందించగా ప్రస్తుతం ఇదే కొనసాగుతోంది. అయితే అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో భోజనంలో నాణ్యత పాటించడం లేదు.



ప్రకాశరావు పేట జీవీఎంసీ స్కూల్లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

అంకెల గారడీ

బడి భోజనం అమలు విషయంలో అంకెల గారడీ ప్రదర్శిస్తూ.. ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపిస్తున్నారు. హాజరైన విద్యార్థుల్లో ఎక్కువ మంది మధ్యాహ్న భోజనం తింటున్నట్లు పేర్కొంటున్నారు. కానీ స్కూళ్లలో వాస్తవ పరిస్థితులు మరోలా ఉన్నాయి. ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకున్న విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. మరి ఈ సరుకులు ఏమైపోతున్నట్లనేది తేలాల్సి ఉంది.




గోపాలపట్నం జెడ్పీ బాలుర స్కూల్లో ఇంటి భోజనం తింటున్న విద్యార్థులు

ఇంటి నుంచే క్యారేజీలు

గోపాలపట్నం జెడ్పీ బాలికల హైస్కూల్లో 986 మంది విద్యార్థినులు ఉండగా.. సాక్షి పరిశీలన చేసిన రోజు 779 మంది బడికి హాజరయ్యారు. ఇందులో 770 మంది మధ్యాహ్న భోజనం తిన్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కానీ, ఇక్కడ చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సుల్లో భోజనం తింటూ కనిపించారు. నగరంలోని ప్రకాశరావు పేట జీవీఎంసీ స్కూల్లోనూ ఇదే పరిస్థితి. బడికి హాజరైన 456 మందిలో 441 మంది భోజనం తిన్నారని రికార్డుల్లో నమోదు చేశారు. కానీ చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సుల్లో భోజనం తిన్నారు. ఇవే కాదు జిల్లాలోని చాలా స్కూళ్లలో విద్యార్థులు ఇళ్ల నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులు సైతం నేరుగా స్కూళ్లకు క్యారేజీలు తెచ్చి ఇస్తున్నారు.




ప్రకాశరావు పేట జీవీఎంసీ స్కూల్లో ఇంటి నుంచే భోజనం తెచ్చి తినిపిస్తున్న తల్లి



ముద్దకట్టిన పలావ్





ఉడకని పులిహోర

రుచిలేని భోజనం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మెనూ అయినప్పటికీ, వంటకంలో పూర్తిగా తేడా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం మెనూ మార్పు చేస్తామని ప్రకటన చేయటంతో, ప్రస్తుతం విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపించింది. జిల్లా విద్యాశాఖాధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవటంతో బడి భోజనం అధ్వానంగా ఉంది. వండిన పదార్థాలు రుచిగా లేక, విద్యార్థులు తినడం లేదు. ఒక వేళ ప్లేట్లలో పట్టుకుంటున్నా తినలేక పాడేస్తున్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు ఇళ్ల నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్నారు.

కేజీహెచ్‌లో ఎండోస్కోపీ మిషన్ ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్ గాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రూ.20 లక్షల విలువైన ఎండోస్కోపీ మిషన్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోన్ వితరణగా ఇచ్చింది. ఈ మిషన్‌ను మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభించారు. పేద రోగులకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని కేజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్ చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ శ్రీనివాస్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎస్.సీతా రామ్, ఫెడరేషన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వంశీ యాదవ్, డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.



ఎండోస్కోపీ మిషన్‌ను ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

ధరలపై సమీక్ష

మహారాణిపేట: కూరగాయలు, నిత్యావసర సరకులు, పప్పు దినుసులు, బియ్యం ధరలపై జేసీ మయూర్ అశోక్ మంగళవారం తన కార్యాలయంలో సమీక్షించారు. టమాటాలు, ఉల్లిపాయలు, ఇతర నిత్యావసర వస్తువులు ధరలు, రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్న వంట నూనెల ధరలను ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించాలని స్పష్టం చేశారు. డీఎస్‌వో వి.భాస్కర్, హార్టికల్చర్, మార్కెటింగ్, అన్ని రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్, ఆహార ధాన్యాలు, పప్పులు, ఆయిల్ టోకు వర్తక సంఘం, చిల్లర వర్తక సంఘం, రైస్ మిల్లర్స్ సంఘం ప్రతినిధులు సమీక్షలో పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతిగృహాలను తరలించొద్దు

ప్రభుత్వానికి ఈఏఎస్ శర్మ లేఖ

సీతమ్మధార: జీవీఎంసీ పరిధిలోని నిరాశ్రయుల వసతిగృహాలను తరలించాలన్న ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు ప్రభుత్వానికి రాసిన లేఖ ప్రతులను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. 'గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు జీవీఎంసీ అందుబాటులో ఉన్న భవనాల్లో నిరాశ్రయుల షెల్టర్లను ప్రారంభించింది. జీవీఎంసీ, ప్రభుత్వ రంగ సంస్థలు, దాతల ఆర్థిక సాయంతో... పోలీసుల సహకారంతో స్వచ్ఛంద సంస్థలు ఈ షెల్టర్లను నడుపుతున్నాయి. ఈ విధంగా 6,150 మంది నిరాశ్రయులకు ఈ షెల్టర్లలో ఆశ్రయమిచ్చారు. కొంత మందికి పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించారు. మరికొంత మంది చిరునామాలు గుర్తించి.. వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అటువంటి నిరాశ్రయుల షెల్టర్లను నగర శివారు ప్రాంతాలకు తరలిస్తే వారికి భద్రత కరువుతుంది. ముఖ్యంగా మహిళలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించలేరు. వైద్య సేవలు కూడా లభించవు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం లక్ష జనాభాకు ఒక షెల్టర్ ఉండాలి. ఇంతవరకు ఆ ఆదేశాన్ని ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదు. ప్రతీ రెండు మూడు వార్డులకు కనీస దూరంలో ఒక షెల్టర్ ఉండాలి. కానీ ప్రభుత్వం అన్ని షెల్టర్లను నగరంలోని మారుమూల ప్రాంతాలకు తరలిస్తే.. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు అవుతుంది. ఎక్కడ ఉన్న షెల్టర్లను ఆ ప్రాంతాల్లోనే నడుపుతూ.. వాటిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.' అని శర్మ తన లేఖలో పేర్కొన్నారు.